సిఐటియుతో సోమయ్యకు సంబంధం లేదు

జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్యను సిఐటియు నుండి తొలగిస్తూ సిఐటియు జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం తీర్మానించిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన సిఐటియు జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. సోమయ్య సిఐటియు పద్ధతులు, క్రమశిక్షణకు భిన్నంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై చర్య తీసుకున్నట్లు తెలిపారు. ఇక నుండి సిఐటియుతో సోమయ్యకు ఎటువంటి సంబంధమూ లేదని, ఆయన చర్యలకు సిఐటియు బాధ్యత వహించదని, కార్మికులు ఈ అంశాలను గమనంలో పెట్టుకోవాలని కోరారు.

బీమా భరోసా కరువు..!

- కార్పొరేట్లకు పెద్ద పీట.. సామాన్యుల పట్ల నిర్లక్ష్యం
- ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు
- ఏడాదిలో మూడు వేల మందికిపైగా మృతి చెందినట్లు అంచనా
- విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పామాయిల్ కార్మికులే 18 మంది
- మేనిఫెస్టోలో పెట్టినా అమలు నోచుకోని చంద్రన్న బీమా పథకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ వందల, వేల ఎకరాల భూములు కట్టబెడుతూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం.. సామాన్యులకు అందించే బీమా పథకాన్ని మాత్రం అమలు చేయని పరిస్థితి నెలకొంది. అధికారంలోకొచ్చి ఏడాది దాటినా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన చంద్రన్న బీమా పథకం అమలుకు నోచుకోలేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి గడిచిన ఏడాదిలో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బీమా సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో విలవిల్లాడుతున్నాయి. ఇల్లు గడవడమే కష్టంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం వైఎస్‌ఆర్ బీమా పథకాన్ని అమలు చేసింది. సాధారణ మరణం అయితే రూ.లక్ష, ప్రమాద మరణమైతే రూ.ఐదు లక్షల చొప్పున ఆ కుటుంబానికి బీమా పథకం కింద ఆర్థిక సాయం అందేది. 2021-22లో ఏలూరు జిల్లాలో 1,500 కుటుంబాలకు, 2022-23లో 1,610 కుటుంబాలకు, 2023-24లో 1,149 కుటుంబాలకు వైఎస్‌ఆర్ బీమా కింద ఆర్థిక సాయం అందింది. పశ్చిమగోదావరి జిల్లాలో అదే స్థాయిలో బీమా సొమ్ము అందిన పరిస్థితి ఉంది. గత లెక్కల ప్రకారం చూస్తే ఏడాదికి రెండు జిల్లాల్లో మూడు వేల వరకూ మరణాలు సంభవిస్తున్నాయి. సామాన్య కుటుంబాలకు

బీమా ఎంతగానో అండగా ఉండేది. 2014-19 మధ్యలో చంద్రన్న బీమా పథకం కింద సాయం అందించిన పరిస్థితి ఉంది. 2024లో జరిగిన ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా పథకం అమల్లోకి తెస్తామని, సాధారణ మరణాలకు రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణాలకు రూ.పది లక్షలు ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టింది. కూటమి అధికారంలోకొచ్చి 15 నెలలు అవుతోంది. ఇప్పటి వరకూ చంద్రన్న బీమా పథకం అమలు చేయలేదు. కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ సామాన్య కుటుంబాలకు అండగా ఉండే బీమా పథకం అమలులో మాత్రం లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య కుటుంబాల్లో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పిల్లలను చదివించుకోలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్న పరిస్థితి ఉంది. చంద్రన్న బీమా అమలు చేసి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తే ఆయా కుటుంబాలకు కొంత ఊరట దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం అటువైపు ఏమాత్రం ఆలోచించకుండా ముందుకు సాగుతోంది. గడిచిన 15 నెలల కాలంలో విద్యుత్ షాక్‌కు గురై ఏలూరు జిల్లాలో 18 మంది పామాయిల్ కార్మికులు చనిపోయారు. ఆయా కుటుంబాలకు కనీస ఆర్థిక సాయం సైతం అందలేదు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోవడంతో ఆయా కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యుత్ సంస్థ నుంచి సైతం వారికి ఎటువంటి సాయమూ అందని దుస్థితి. సామన్యులకు అండగా నిలిచే బీమా పథకం అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంపై జనాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు బీమా పథకం అమలు కోసం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి తమకు ఆర్థిక సాయం అందేలా చూడాలని అర్థిస్తున్నారు. ప్రభుత్వం ఇంకా చంద్రన్న బీమా పథకం అమలు చేయలేదని అధికారులు వెనక్కి తిప్పి పంపుతున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ బీమా పథకాన్ని అమలు చేసింది. దీంతో బాధితులు సంబంధిత అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. చంద్రన్న బీమా పథకం వెంటనే అమలు చేసి సామాన్య కుటుంబాలకు అండగా నిలవాలని అంతా కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు సైతం చంద్రన్న బీమా అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జనం కోరుతున్నారు.

తగ్గని వరద గోదావరి

- ముంపులనే గుండేటి, పాలవాగు, ఎద్దువాగు కాజ్‌వేలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- భద్రాచలంలో కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మండలంలోని పంటలు నీట మునిగి రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో రుద్రంకోట, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, కన్నాయిగుట్ట తదితర గ్రామాల్లో వరి, పత్తి చేలు వందల ఎకరాల్లో నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రుద్రంకోట నుంచి రేపాకగొమ్ము, వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో కాజ్‌వేలు మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎద్దువాగు కాజ్‌వే మునగడంతో కొత్తూరు, బోళ్లపల్లి, నాళ్లవరం , ఎడవల్లి, చిగురుమామిడి, కోయిదా, కట్కూరు తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైన వారు బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు.

కుక్కునూరు రూరల్: గోదావరికి వరద ఉధృతి ఆదివారం ఐదోరోజూ కొనసాగింది. భద్రాచలంలో ఆదివారం ఉదయం గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. అయితే సాయంత్రానికి కొంచెం తగ్గి 47.9 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. భద్రాచలంలో గోదావరి నిలకడగా ఉన్నా మండలంలో వరద నిదానంగా పెరుగుతోంది. ఇప్పటికే 17 రోజులుగా గుండేటి వాగు కాజ్‌వే నీట మునగడంతో 12 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై కాజ్‌వే మునగడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని వదులుతుండటంతో గోదావరికి మరో రెండు రోజులపాటు వరద ఉధృతి కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు శబరి ఉగ్రరూపం దాల్చడంతో గోదావరికి వరద ఉధ తి కొనసాగుతూనే ఉంది. దీంతో ముంపు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు



కుక్కునూరు ఎ బ్లాక్ సమీపంలోకి చేరిన వరద నీరు

కన్నాయిగుట్ట వెళ్లే మార్గంలో వాగు పొంగడంతో నీట మునిగిన రహదారి

యలమంచిలి: కనకాయలంకకు బోట్లపై రాకపోకలు సాగిస్తున్న జనం

కాలువలో నీటి ఉధృతిని అంచనా వేయలేక.. ప్రమాదవశాత్తూ హెడ్ కానిస్టేబుల్ గల్లంతు

- డిఎస్‌పి ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ గాలింపు చర్యలు
- రోజున్నర తర్వాత మృతదేహం లభ్యం
- బాధిత కుటుంబసభ్యులకు ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పరామర్శ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం

రాత్రి సమయంలో బైక్‌పై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎర్ర కాలువలో నీటి ఉధృతిని అంచనా వేయలేకపోవడంతో ప్రమాదవశాత్తూ కాలువలో గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి టి.నరసాపురం మండలంలోని అప్పలరాజుగూడెం - మధ్యాహ్నపువారిగూడెం గ్రామాల మధ్య ఉన్న ఎర్ర కాలువ వంతెన వద్ద చోటు చేసుకుంది. శనివారం ఉదయం కుటుంబసభ్యుల ఫిర్యాదుతో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం ఉదయం జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం వద్ద మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయగూడెం మండలానికి చెందిన బుడుపుల సుబ్బారావు(55) జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని టి.నరసాపురం, తడికలపూడి మండలాల్లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి టి.నర్సాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి పది గంటల సమయంలో బైక్‌పై వెళ్తూ అప్పలరాజుగూడెం చిన్న వంతెన వద్ద ప్రవహించే ఎర్రకాలువ ఉధృత అంచనా వేయలేకపోవడంతో ప్రమాదవశాత్తు ఆయన కాలువలో కొట్టుకుపోయారు. శుక్రవారం రాత్రి ఇంటికి రాకపోయేసరికి ఆయన కుమారుడు రాజ్‌కుమార్ శనివారం ఉదయం తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి సుబ్బారావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గత ఈతగాళ్లతో, డ్రోన్ కెమెరాల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం ప్రాంతంలో సుబ్బారావు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య పద్మమాలిని, కుమారుడు రాజ్‌కుమార్, కుమార్తె ఉన్నారు.

సుబ్బారావు (ఫైల్)



ఘటనా స్థలంలో సుబ్బారావు బైక్

గత ఈతగాడు బయటకు తీసిన మృతదేహం

కుటుంబసభ్యులకు ఎంఎల్‌ఎ పరామర్శ

హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ఆదివారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పోలీసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పోలీసులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బాలరాజు

అధికారంలో అలజడి..!

అధికారపక్షమైన కూటమిలో అలజడి నెలకొంది. అటు పశ్చిమలో కలెక్టరేట్ అంశం, టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మిపై సొంత పార్టీలోనే నిరసన గళం, ఏలూరు జిల్లాలో టిడిపి సమావేశంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని వ్యాఖ్యల కలకలం అధికార పార్టీలైన టిడిపి, జనసేనల్లో అలజడి నెలకొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

కలెక్టరేట్ భవన నిర్మాణం ఎక్కడనేది పశ్చిమగోదావరి జిల్లాలో చర్చనీయాంశమైంది. పి-4 పద్ధతిలో ఉండి నియోజకవర్గ పరిధిలోని పెదఅమిరంలో నిర్మించడానికి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామ కృష్ణరాజు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. ఇరిగేషన్ స్థలం అందుబాటులో ఉండటంతోపాటు భవనాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగం దాతలు భరిస్తారని ఆయన చెప్పుకొస్తున్నారు. అదే క్రమంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రకటించినట్లుగానే మార్కెట్ యార్డులో కలెక్టరేట్ నిర్మించాలని వైసిపి, కాంగ్రెస్ కోరుతున్నాయి. అసలు కూటమి ప్రభుత్వం ఏం చేయదల్చుకుందో భీమవరం ఎంఎల్‌ఎ అంజిబాబు, జిల్లా మంత్రులు, కలెక్టర్ స్పష్టం చేయాలని సిపిఎం మొదటి నుంచి డిమాండ్ చేస్తోంది. గత వైసిపి ప్రభుత్వం మార్కెట్ యార్డులో 20 ఎకరాల స్థలాన్ని కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి కేటాయిస్తూ జిఒ జారీ చేసింది. అయితే తదుపరి అడుగులు ముందుకు పడలేదు. ఈలోపు ఎన్నికలు రావడంతో వైసిపి అధికారం కోల్పోయి కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో జిల్లాల విభజనలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. నాటి నుంచి నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని, గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని ఆందోళనలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కలెక్టరేట్ భవనాలు ఉండి నియోజకవర్గ పరిధిలోని పెదఅమిరంలో నిర్మించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రతిపాదించడం, దానికి ఆ ప్రాంతంలో ఇరిగేషన్ స్థలం మూడున్నర ఎకరాలు ఉందని గుర్తించి, జిల్లా అధికారులు సైతం పరిశీలించడం చర్చనీయాంశమైంది. ఇటీవల శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు సైతం భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ భవనానికి మార్కెట్ యార్డులో స్థలం సరిపోదంటే తాడేరు రోడ్డులో టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద పూడ్చి సిద్ధంగా ఉన్న స్థలం 30 ఎకరాలు ఉందనే అంశాన్ని ఆయన తెరపైకి తీసుకొచ్చారు. వీటన్నింటిపై ఎంఎల్‌ఎ అంజిబాబు స్పందిస్తూ కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుందని, ఎక్కడికీ తరలిపోదని ప్రకటించారు. అయితే గొల్లవానితిప్ప రోడ్డులోనూ స్థలాల కోసం పరిశీలిస్తున్నామని తెలిపారు. మొత్తంగా జనసేనకు చెందిన పిఎసి ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ అంజిబాబు కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుందంటుంటే, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు పెదఅమిరాన్ని అవసరమైతే భీమవరం పట్టణంలో కలిపేస్తామని, కలెక్టరేట్ మాత్రం పెదఅమిరంలోనే నిర్మించాలని పట్టుబట్టడం గమనార్హం. మొత్తంగా కలెక్టరేట్ అంశం జనసేన, టిడిపి మధ్య విబేధాలకు ఆజ్యం పోస్తుందా, లేక టీ కప్పులో తుపానులా సమసిపోతుందా అనేది వేచిచూడాలి. ఏదేమైనా ప్రజాభీష్టం కాకుండా ఎంఎల్‌ఎల అభిప్రాయం మేరకు కలెక్టరేట్ నిర్మాణం సాగనుందని ప్రస్తుత పరిణామాలు చెబుతున్నాయి. ఏదేమైనా నాడు ఎఎంసిలో కలెక్టరేట్ నిర్మాణం సాగిస్తే అక్కడికొచ్చే ప్రజలకు రవాణా సౌకర్యానికి పెద్దగా ఇబ్బంది ఉండదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఎఎంసికి సమీపంలోనే భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్, మరికొంచెం దూరంలోనే బస్ కాంప్లెక్స్ ఉండటంతో అక్కడ కలెక్టరేట్ నిర్మాణానికి ఎవరి నుంచి ఎటువంటి అభ్యంతరాలూ వ్యక్తం కాలేదు. తాజాగా పెదఅమిరం అంటే అది భీమవరం పట్టణానికి ఆనుకునే ఉన్నా బస్టాండ్‌కు సుమారు ఆరు కిలోమీటర్ల వరకూ వెళ్లాల్సి ఉంటుంది. కాళ్ల వైపు నుంచి వచ్చే వారు మినహా ఇటు పాలకొల్లు, అటు తణుకు, తాడేపల్లిగూడెం వైపుల నుంచి వచ్చే వారు కచ్చితంగా ప్రయివేటు వాహనాలు లేదా కాళ్ల వైపు వెళ్లే ఆర్‌టిసి బస్సులను ఆశ్రయించక తప్పదు. దానికి తోడు ఆ మార్గంలో ఎస్‌ఆర్‌కె ఇంజినీరింగ్ కళాశాల వరకూ ఇప్పటికే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కలెక్టరేట్ నిర్మాణంతో ఈ సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది. ఏదేమైనా సిఎం, డిప్యూటీ సిఎం స్థాయిలోనే కలెక్టరేట్ నిర్మాణంపై స్పష్టత ఇస్తేగాని జనంలో నెలకొన్న గందరగోళం వీడే అవకాశం లేదు.

ఇక మాజీ ఎంపీ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తీరుపై వీరవాసరం మండలంలోని బిసి నేతలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఇక్కడ పార్టీలో గ్రూపు విభేధాలు పెరుగుతున్నాయనే ప్రచారం ఉంది. అదే సమయంలో మిత్రపక్షమైన జనసేనతోనూ అంతర్లీనంగా విబేధాలు పొడచూపుతున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవుల విషయంలో ముందు ప్రకటించిన పేర్లను మార్చడమే దీనికి నిదర్శనమనే ప్రచారం సాగుతోంది. అక్కడి సీనియర్ నేతల్లో ఒకరైన సీతారామలక్ష్మిపైనే అసంతృప్తి గళమెత్తడంతో జిల్లాలోని మంత్రి, సీనియర్ నేతలు జోక్యం చేసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఇక ఏలూరు జిల్లాలోనూ టిడిపి, జనసేన నేతల్లో అలజడి నెలకొంది. జిల్లా అధ్యక్ష పదవిపై చర్చించేందుకు ఇటీవల ఏలూరులో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు పదవులు పొంది పార్టీలో పెత్తనం సాగిస్తున్నారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. అదేస్థాయిలో మంత్రి కొలుసు పార్థసారథి ధీటుగా సమాధానం ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే గన్ని వీరాంజనేయులు, ఇతర నేతలు జోక్యం చేసుకుని అంతా చంద్రబాబు నిర్ణయం ప్రకారమే జరుగుతున్నాయని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆ పార్టీలో అంతర్లీనంగా ఉన్న విబేధాలకు నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుపై అవినీతి ఆరోపణలు ఆ పార్టీ నేతలను ఇరుకున పెట్టాయి. జనసేన ఎంఎల్‌ఎలు యువత కావడం, కొత్తవారు కావడంతో కొంత సమన్వయ సమస్యలు ఎదుర్కొంటున్నారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా అధికార పార్టీలైన టిడిపి, జనసేనల్లో అధికారం అలజడి సృష్టిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం

- అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు
- బిసి సంక్షేమ శాఖాధికారి నాగరాణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బిసి హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, వర్షాకాలంలో విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని బిసి సంక్షేమ శాఖాధికారి నాగరాణి చెప్పారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆమె పలు అంశాలు వెల్లడించారు.

ప్రశ్న: బిసి సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యాలు ఏమిటీ?

నాగరాణి: సమాజంలో అభివృద్ధి చెందిన ఇతరులతో సమానంగా అంటే విద్య, సామాజిక, ఆర్థికపరంగా వెనుకబడిన వారిని వృద్ధిలోకి తీసుకురావడమే మా శాఖ లక్ష్యం. వారికి న్యాయమైన, సమానమైన సామాజిక వ్యవస్థను సాధించడమే దీని లక్ష్యం.

ప్రశ్న: బిసి హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఆహారం మెనూ ఏ విధంగా అమలు చేస్తున్నారు?

నాగరాణి: బిసి హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఎన్నో పోషకాలు ఉన్న పౌష్టికాహారాన్ని అందిస్తున్నా. వారంలో రెండు రోజులు చికెన్ బిర్యానీ, ఐదు రోజులు గుడ్లు, రాగి లడ్డూ, పండ్లు, ప్రతిరోజూ పాలు, వేరుశనగ చిక్కీ వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

ప్రశ్న: బిసి వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి?

నాగరాణి: బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉంటాయి. విద్యార్థులకు మంచి డైట్ ఛార్జీలు అందిస్తున్నాం. ఆహార పరంగా మంచి మెనూ అందిస్తున్నాం. అదేవిధంగా కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తాం. స్కూల్ నుంచి వచ్చిన తర్వాత ట్యూటర్స్‌ను పెట్టి హాస్టళ్లలో చదివిస్తాం. ఇంతకు ముందు విద్యార్థులు వచ్చినా, రాకపోయినా తెలిసేది కాదు. ఇప్పుడు ఎఫ్‌ఆర్ఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాం. అదేవిధంగా ఉద్యోగులకూ ఎఫ్‌ఆర్ఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ముఖ్యంగా ఎస్ఎస్‌సిలో మంచి ఫలితాలు రావడం కోసం ట్యూటర్లను పెట్టి శ్రద్ధగా విద్యార్థులను చదివిస్తున్నాం.

ప్రశ్న: బిసి హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటివి ఎలా అమలు చేస్తున్నారు?

నాగరాణి: విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌గాని, స్కాలర్‌షిప్‌గాని స్కూల్ ద్వారానే దరఖాస్తు చేసుకుంటారు. అవి మా వద్దకు వచ్చినప్పుడు మేము వెంటనే అప్రూవల్ చేసి విద్యార్థులకు అవి వచ్చేలా చూస్తాం.

ప్రశ్న: జిల్లాలోని కొన్ని హాస్టళ్లలో మరుగుదొడ్లుగాని, భవనాలుగాని శిథిలావస్థలో ఉన్నట్లు సమాచారం. వాటి మరమ్మతులు, పునర్నిర్మాణానికి ఏమైనా నిధులు మంజూరయ్యాయా?

నాగరాణి: హాస్టళ్లలోని చిన్న చిన్న మరమ్మతులకు, మరుగుదొడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వాటిలో ఒక్కో హాస్టల్‌కు రూ.లక్షా 50 వేలు చొప్పున వచ్చాయి. వాటిని కలెక్టర్ ఆధ్వర్యంలో పనులు నిర్వహించే శాఖలకు ఆ నిధులు ఇచ్చి అన్నింటినీ బాగు చేయించాం. నీటి సమస్య లేకుండా కూడా చూసుకున్నాం. కొన్నిచోట్ల టాయిలెట్లు సరిపోని చోట్ల ఎస్‌పిఎం టాయిలెట్స్ అని ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా మంజూరయ్యాయి. వాటిని ప్రస్తుతం నిర్మిస్తున్నారు.

ప్రశ్న: ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి హాస్టళ్లలో సీజనల్ వ్యాధులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

నాగరాణి: ప్రస్తుతం వర్షాకాలంలో వర్షం పడుతుండడంతో ఎవరికి ఎటువంటి సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులకు వేడి నీటిని అందిస్తున్నాం. ప్రతిరోజూ శానిటేషన్ చేయిస్తున్నాం. మెడికల్ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నాం. అక్కడ ప్రతిరోజూ నర్సులు అందుబాటులో ఉంచి విద్యార్థులను చూసుకునేలా ఏర్పాట్లు చేశాం. ఆయా ప్రాంతాల ఎంపిడిఒలను, తహశీల్దార్లను అందరినీ హాస్టళ్లను సందర్శించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మేం కూడా నెలలో 15 రోజులు హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: బిసి విద్యార్థులు హాస్టళ్లలో చేరేలా ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు?

నాగరాణి: పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను కలుస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులను కలిసి మాట్లాడుతున్నాం. వారికి బిసి హాస్టళ్లలో కల్పించే సౌకర్యాలు, ఆహ్లాదకర వాతావరణం గురించి అర్థమయ్యేలా తెలియజేసి హాస్టళ్లలో చేరేలా ప్రోత్సహిస్తున్నాం. హాస్టళ్లలో మంచి ఆహారం అందిస్తున్నాం. మంచి వాతావరణంలో ఉంచుతున్నాం. బాగా చదివిస్తున్నాం. వారికి ముఖ్యంగా భద్రత కల్పిస్తున్నాం కాబట్టి తల్లిదండ్రులందరూ తెలుసుకొని బిసి హాస్టళ్లలో తమ పిల్లలను చేర్పించి మంచిగా చదివించాలని కోరుతున్నాం.

ప్రశ్న: జిల్లాలో బిసి హాస్టళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో విద్యార్థుల సంఖ్య ఎంత?

నాగరాణి: జిల్లాలో మొత్తం 35 హాస్టళ్లు ఉన్నాయి. అందులో 2284 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ప్రీ మెట్రిక్ 930 మంది ఉన్నారు. పోస్ట్ మెట్రిక్‌లో 1354 మంది ఉన్నారు.

ప్రశ్న: జిల్లాలోని హాస్టళ్లలో వార్డెన్ల కొరత ఏమైనా ఉందా?

నాగరాణి: హాస్టల్ వార్డెన్ల కొరత ఉంది. వాటిని భర్తీ చేయాలని కోరాం. వారి నియామకం అంతా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ఒక ప్రక్రియ ద్వారా పూర్తి చేస్తుంది.

ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా హైమావతి, శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పి.హైమావతి, ఎ.శ్యామలారాణి ఎన్నికయ్యారు. స్థానిక యుటిఎఫ్ భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన ఐద్వా జిల్లా మహాసభలో రెండో రోజు ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.వరలక్ష్మి, ఎన్.పద్మాంజలి, సహాయ కార్యదర్శులుగా ఎన్.నిర్మల, ఎం.అరుణ, మడకం కుమారి ఎన్నికయ్యారు. 19 మంది సభ్యులతో జిల్లా కమిటీ ఎన్నికైంది. మహాసభలో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ తీర్మానాలు ఆమోదించారు. బెల్ట్ షాపులను తక్షణం నిర్మూలించాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ ఆగడాలను అరికట్టాలని, పేద కుటుంబాలకు ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. రానున్న కాలంలో ఈ సమస్యలపై జిల్లాలో మహిళలను సమీకరించి ఉద్యమాలను నిర్వహించాలని మహాసభ తీర్మానించింది. మహాసభ ముగింపులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, సహాయ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని, వాటి పరిష్కారానికి నిర్విరామ పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు.

హైమావతి

శ్యామలారాణి

లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, వాటిని వినియోగించుకుని సైబర్ నేరగాళ్ల మరిన్ని మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదివారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం అనేక లోన్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆ యాప్ లైసెన్స్ ప్రభుత్వ గుర్తింపు పొంది ఉందా లేదా అన్న అంశాన్ని గూగుల్ ద్వారా తెలుసుకోవాలని పేర్కొన్నారు. లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసే ముందు ప్లే స్టోర్‌లో ఉన్న రివ్యూలను గుర్తించాలని తెలిపారు. డౌన్‌లోడ్ చేసే సమయంలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, కాంటాక్టులకు సింక్రోనైజేషన్ యాక్సెప్ట్ అనే ఆప్షన్ వస్తుందని, వాటిని సింక్రోనైజ్ చేయకుండా ఉంటే మీ వివరాలు వారికి వెళ్లవని తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపిన లింకులను, వాయిస్ మెసేజ్‌లను, కాల్స్ నమ్మి మోసపోవొద్దని పేర్కొన్నారు. ఒటిపిలు ఎవరు అడిగినా తెలియ చేయవద్దని, డెలివరీ కంపెనీ పేర్లతో వచ్చిన ప్రకటనలను నమ్మవద్దని తెలిపారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి సమాచారం ఇచ్చి దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయాలని తెలిపారు. 1930కి సమాచారం ఇవ్వడం ద్వారా సైబర్ పోలీసులు వెంటనే జరిగిన ఘటనపై స్పందించి సొమ్మును వెనక్కి తెచ్చేందుకు కృషి చేస్తారని తెలిపారు. లోన్ యాప్ ద్వారా తీసుకునే లోన్ల వల్ల వ్యక్తిగత సమాచారం వారి వద్ద ఉండటం వల్ల మీ ఫోన్ నెంబర్లకు మీ వ్యక్తిగత సమాచారం షేర్ చేస్తామని, వాటిని మార్ఫింగ్ చేసి షేర్ చేస్తామని బెదిరింపులకు గురిచేస్తూ ఇచ్చిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ములను తిరిగి వసూలు చేస్తారని తెలిపారు. ఇదే సైబర్ నేరగాళ్ల పక్క ప్రణాళికని తెలిపారు. ప్రజలు లోన్ యాప్లకు దూరంగా ఉండాలని తెలిపారు.

పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

జాతీయ రహదారికి తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి వరకు జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడటంతో పాటు వాటిలో నీరు చేరి నిల్వ ఉండడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రహదారి గుండా ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు అధికారులకు విన్నవించినా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఎస్ఐ వి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జెసిబి సహాయంతో రహదారిపై పడిన గోతులను చదును చేసి గోతులు లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను పురస్కరించుకుని ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విజేతలైన ప్రైమరీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి బహుమతులు అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయని విజకుమారి తెలిపారు. ఆటల పోటీల్లో విజేతలైనవారికి క్రీడా సర్టిఫికెట్స్ ఉపాధ్యాయులు బివివిఎస్‌వి.ప్రసాద్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రం, నాగరాజు, ఫిలోమిన, శ్రీ మంగలక్ష్మి, జాస్మిన్, వెంకట రమణ, కృష్ణకుమారి, రాజేంద్ర ప్రసాద్, బివివిఎస్‌వి.ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న శెట్టిబలిజలు

ఎక్సైజ్ కార్యాలయం వద్ద శెట్టిబలిజల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో శెట్టిబలిజ సామాజిక తరగతివారికి ప్రభుత్వం కేటాయించిన బార్‌ను తమ సామాజిక తరగతికి చెందినవారికే ఇవ్వాలని కోరుతూ శెట్టిబలిజలు ఆదివారం ఏలూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం జిల్లా ప్రెసిడెంట్ కోడి దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సామాజిక తరగతికి కేటాయించిన షాపు బైరెడ్డి విజయ్‌కుమార్ అనే వ్యక్తికి వెళ్లిందని, అయితే ఆ వ్యక్తి శెట్టిబలిజ సామాజిక తరగతికి సంబంధించిన వ్యక్తి కాదని, ఫేక్ సర్టిఫికెట్ పెట్టి ప్రభుత్వాన్ని మోసం చేశాడని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కడలి శ్రీనివాస్, శెట్టిబలిజ సభ్యుడు కేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి ఏలూరు పోర్ట్స్

పట్టపగలు ఇంట్లో అన్నం తింటున్న వ్యక్తిని ఇంటి బయటకు పిలిచి కత్తులతో పొడిచి హతమార్చారు. ఈ ఘటన ఏలూరు రూరల్ మండలం పాలగూడెం పంచాయతీ వైఎస్‌ఆర్ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాలగూడెం పంచాయతీ వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన పునూరు రాజేష్ (42) ఇంటికి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన బూరుగు నాని (చిన్నినాని) వచ్చి రాజేష్‌ను బయటకు తీసుకెళ్లాడు. రాజేష్ ఇంటి సమీపంలోనే ఉన్న చర్చి వద్దకు తీసుకొచ్చిన అనంతరం అకస్మాత్తుగా నానితోపాటు మరో ముగ్గురు వ్యక్తులు రాజేష్‌పై కత్తులతో దాడి చేశారు. దీంతో రాజేష్ కేకలు వినిపించడంతో అతని కుమారుడు, కుమార్తె, అతని చెల్లెలు రావడంతో నలుగురు వ్యక్తులు కారులో పరారయ్యారు. దాడిలో తీవ్ర గాయాలపాలైన రాజేష్‌ను కుటుంబసభ్యులు ఏలూరు జిజిహెచ్‌కు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించే ప్రయత్నం చేశారు. తీవ్ర గాయాలు కావటంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

హత్యపై ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాలతో ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు పాల్పడిన వ్యక్తుల్లో ప్రధాన నిందితుడు బూరుగు నానిగా పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న వారందరినీ పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించినట్లు చెబుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అలుపెరుగని ప్రజావైద్యులు 'పోతుమూడి'..!

36 ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యవృత్తి
సామాన్యుల్లో మనస్సుల్లో వైద్యబంధువుగా పేరు
కరోనా వంటి విపత్తులో ప్రాణాలు ఫణంగా పెట్టి సేవలు
నాడి పట్టిచూస్తే ఇట్టే రోగం చెప్పేసే వైద్యనైపుణ్యం ఆయన సొంతం

ప్రజాశక్తి. ఏలూరు అర్బన్.

వైద్యవృత్తిని ఉద్యోగంలా కాకుండా ప్రజలకోసమే అన్నట్లు భావించి పనిచేసిన వైద్యుల్లో డాక్టర్ పోతుమూడి శ్రీనివాస్ అగ్రస్థానంలో నిలుస్తారు. వైద్య విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైపు పరుగులు తీసే కాలంలోనూ ఆయన తన పదవీవిరమణ వరకూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పనిచేసి పేదలకు వైద్యసేవలు అందించారు. అనేకమంది ప్రాణదాతగా నిలిచిన డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు ప్రజావైద్యుడిగా వైద్యరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. 1988 మచిలీపట్నం జిల్లా ఆసుపత్రిలో వైద్యునిగా ప్రారంభమైన ఆయన ప్రస్తానం ఏలూరు జిల్లా నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ ఫిజిషియన్‌గా ఆగస్టు 31వతేదీ ఆదివారం పదవీవిరమణ వరకూ 36 ఏళ్లకుపైగా సాగింది. డాక్టర్ పోతుమూడి పదవీవిరమణ గురించి తెలిసి సామాన్య ప్రజల్లో తీవ్ర ఆవేదన అలుముకుంది. అలాంటి డాక్టర్‌ను మళ్లీ చూస్తామా అంటూ జనాల్లో చర్చ సాగుతుందంటే ఆయన సామాన్య ప్రజానీకం మనస్సుల్లో ఏవిధంగా చోటు సంపాదించారో అర్థంచేసుకోవచ్చు. నాడి పట్టి చూశారంటే ఎలాంటి రోగమైన ఇట్టే పసిగొట్టే గొప్ప వైద్యనైపుణ్యం ఆయన సొంతమని చెప్పొచ్చు. ముఖ్యంగా ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ఆయన అందించిన సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. పోతుమూడి శ్రీనివాసరావు లేకపోవడం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ముప్పై ఆరు ఏళ్లకుపైగా సాగిన ఆయన వైద్య ప్రస్థానంను ఒక్కసారి చూస్తే ఔరా అనిపించకతప్పదు. అహంకారంలేని జీవన విధానం, ముఖంలో ఎప్పుడు ప్రశాంత ఆయన సొంతం. ఆయనకు హోదా కాదు. రోగి ఆరోగ్యమే ముఖ్యంఅన్నట్లు తన సేవలను అందిస్తారు.



పోతుమూడి శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

అత్యవసర సమయాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా పేదరోగుల కన్నీళ్లు తుడిచిన క్షణాలు, కరోనా కష్టకాలంలో వేలాది ప్రాణాలు కాపాడిన అంకిత భావం డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు సొంతమని చెప్పొచ్చు

నూతన వైద్యులకు ఆయన రోల్‌మోడల్

రోగులను ఆయన పరీక్షించే విధానం, రోగులపై ఆయన చూపించే శ్రద్ధ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రూ. వేలు ఫీజులు తీసుకుంటున్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యులు కనీసం రోగిని ముట్టుకోకుండా, రోగి చెప్పింది పూర్తిగా వినకుండా పరీక్షలు, మందులు రాసేసి పంపిస్తున్న ఈ రోజుల్లో ఎన్ని వందల మంది రోగులు వచ్చినా, ఎలాంటి విసుగు, అసహనం లేకుండా ఎంతో నిబద్ధతతో అంకితభావంతో ప్రతి రోగిని క్షుణ్ణంగా పరిశీలించి, అవసరం అయిన పరీక్షలు మాత్రమే చేయించి మందులు రాసి ఇచ్చే విధానమే ఆయనున్న అందరి మదిలో నిలిపింది. నూతన వైద్యులకు ఆయన రోల్ మోడల్‌గా నిలిచారు. ముఖ్యంగా కరోనా కుదిపేస్తున్న సమయంలో ఏలూరు జిల్లా ఆసుపత్రిలో ఆయన అందించిన సేవలు జిల్లా ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. జిల్లా ఆసుపత్రిలో పడకలు దొరకక కరోనా రోగులతో కిక్కిరిసిపోయి ఉన్న సమయంలోనూ ప్రతి కరోనా పేషెంట్ వద్దకు వెళ్లి వ్యక్తిగతంగా వారితో మాట్లాడి, వారిని పరీక్షించి, వారి భుజం తట్టి ధైర్యాన్ని నింపి, వారు కోలుకుని తిరిగి ఇంటికి వెళ్లే వరకు అహర్నిశలు ప్రాణాలకు తెగించి చికిత్స అందించిన వైద్యులు పోతుమూడి. ఆయన కరోనా బారిన పడినప్పటికీ కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం తిరిగి విధుల్లో చేరి ఆయన అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు.

ప్రసంశలు..పురస్కారాలు

ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో 1998లో అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ వైద్యులుగా రాష్ట్రస్థాయి అవార్డు అందజేసింది. అలాగే 2010లో అప్పటి రాష్ట్ర హెల్త్ సెక్రటరీ పూనం మాలకొండయ్య చేతుల మీదుగా మరోసారి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. అంతేకాక అనేకసార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ వైద్యులుగా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.అయితే "రోగి పూర్తిగా కోలుకుని వెళ్లేటప్పుడు ఇచ్చే ఒక చిరునవ్వే వైద్యునికి నిజమైన అవార్డు" అని నవ్వుతూ చెబుతారు డాక్టర్ పోతుమూడి.

డాక్టర్ పోతులమూడి శ్రీనివాసరావు నేపథ్యం

మచిలీపట్నం సమీపంలోని తాళ్లపాలెం గ్రామంలో జన్మించారు. తండ్రి ఆర్‌ఎంపి వైద్యునిగా పనిచేయగా తల్లి

రోగులను పరీక్షిస్తున్న శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

గ హిణి. ఆయన ఆరవ తరగతి వరకు విద్యాభ్యాసం అక్కడే పూర్తి చేశారు. ఎనిమిదో తరగతి నుంచి పదవ తరగతి నుంచి ఇంటర్ వరకూ మచిలీపట్నంలోని హిందూ కాలేజ్‌లో పూర్తిచేసిన ఆయన ఎంబిబిఎస్ కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం 1988 ఫిబ్రవరిలోలో తొలిసారి మచిలీపట్నం జిల్లా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా విధుల్లో చేరారు. అనంతరం బదిలీపై ఏలూరు జిల్లా పెదపాడు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి అక్కడ గ్రామీణ ప్రాంతంలో రోగులకు సేవలు అందించారు. అనంతరం సర్వీసులో ఉండగానే జనరల్ మెడిసిన్ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సివిల్ సర్జన్ గా తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ కు బదిలీపై వెళ్లి అక్కడ పని చేశారు. అక్కడినుంచి ఏలూరు జిల్లా ఆసుపత్రికి బదిలీపై వచ్చి 2025 జనవరి వరకు ఏలూరులోనే పనిచేసి వేలాది మంది రోగులకు సేవలు అందించారు. అనంతరం 2025 జనవరిలో నూజివీడు ఏరియా ఆసుపత్రికి బదిలీపై వెళ్లి ఆగస్టు 31వ తేదీ ఆదివారం పదవి విరమణ చేశారు.

4న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలి
రాష్ట్ర కోకో బోర్డు ఏర్పాటు చేయాలి
ఎపి కోకో రైతుల సంఘం సమావేశం

ప్రజాశక్తి - పెదవేగి

సెప్టెంబర్ 4వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒ) ఏర్పాటుపై కోకో రైతుల రాష్ట్ర అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం విజయరాయిలోని గాంధీనగర్‌లో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన కోకో రైతుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సదస్సు ఏర్పాట్లపై చర్చించారు. కోకో రైతుల సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 4న విజయరాయిలోని శ్రీ

అభివాదం చేస్తున్న నేతలు

సీతారామ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సదస్సుకు రిటైర్డ్ ఐపిఎస్ ఎబి.వెంకటేశ్వరరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, నాబార్డు, ఉద్యాన శాఖాధికారులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని వివరించారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా కంపెనీలు రైతులను మోసగిస్తున్నాయని విమర్శించారు. గత సీజన్‌లో కోకో రైతులు రూ.వందల కోట్లు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేసుకుని తమ కోకో గింజలను మార్కెటింగ్ చేసుకునేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని కోకో గింజల కొనుగోలు కంపెనీల మోసాలు అరికట్టాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేలా ఫార్ములా రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోకో బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సదస్సులో కోకో రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేసి కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. సమావేశంలో ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగుల నరసింహారావు, కోనేరు సతీష్‌బాబు, నాయకులు మోరంపూడి సుబ్రహ్మణ్యం, ఆలపాటి శ్రీనివాసరావు, గుంటూరి వెంకటరాజు, తేజ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు యధావిధిగా పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సెప్టెంబర్ ఒకటో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు.

శిఖా ఆకాష్‌కు జాతీయ పురస్కారం

పలువురి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడుకు చెందిన ప్రముఖ అభ్యుదయకవి శిఖా ఆకాష్ జాతీయస్థాయి "తెలుగు తేజం " తెలుగు భాషా పురస్కారం అందుకున్నారు. వ్యవహారిక భాషోద్యమ పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో భువనచంద్ర వేదికలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక కళా రంగాలకు సంబంధించిన శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు గద్దం ఈశ్వరి బాయి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు.

ఘనంగా వినాయకుని ఊరేగింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద వినాయక చవితి వేడుకలు ఐదు రోజులు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం కోలాటం వేసుకుంటూ ఎంతో సాంప్రదాయబద్ధంగా వరసిద్ధి వినాయకుడిని ఊరేగింపుగా నిమజ్జనం చేశారు.

పర్యాటకులతో పేరుపాలెం బీచ్ కళకళ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపి పాలెం సౌత్ గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళ కళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో ఉదయమే బీచ్‌కు చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డున ఆటలాడారు. తీరాన ఉన్న ఆలయాలను సందర్శించి, సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

వేంపాడు మేజర్ కాలువకు నాగార్జునసాగర్ నీరు

రైతుల హర్షం

ప్రజాశక్తి - ముసునూరు

చాలా సంవత్సరాల తర్వాత వేంపాడు మేజర్‌కు నీళ్లు తీసుకురావడం చాలా ఆనందదాయకంగా ఉందని వేంపాడు మేజర్ డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌పి కాలువ ద్వారా వేంపాడు మేజర్‌కు జలాలను అందించడం కోసం మంత్రి పార్థసారథి అహర్నిశలు శ్రమించారన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో సుమారు ఐదారు చోట్ల కాలువకు గండి పడటంతో పాటు, కొంతమేర నీరు సాగకపోవడంతో మంత్రి తన సొంత నిధులతో రెండు మూడు రోజుల పాటు రూ.లక్షల రూపాయలు ఖర్చుపెట్టి, తెలంగాణ ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి ఎప్పటికప్పుడు అధికారులతో పర్యవేక్షణ చేయమని చెబుతూ, నాగార్జున సాగర్ ఎడమ కాలువకు ఎన్‌ఎస్‌పి జలాలను విడుదల చేయడానికి ఎంతో కృషి చేశారని, టిడిపి మండల నాయకులు కొల్లి గంగారం, చలమాల వెంకటేశ్వరరావు, తుమ్మల లక్ష్మణరావు, వీరందరిని కలుపుకుని రాపర్ల బాలకృష్ణ నాగార్జునసాగర్ జలాలు చివరి వరకు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారన్నారు. నేలపాటి కుంట దగ్గర నాగార్జునసాగర్ జలాలకు టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు ఆధ్వర్యంలో కాలువ నీరుకు స్వాగతం పలుకుతూ సారే, పసుపు, కుంకంతో పూజలు నిర్వహించారు. మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నీటికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చేపల ప్యాకింగ్ గుమస్తాలకు బైక్‌లు అందజేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేపల లోడు జట్టు కూలీలకు, గుమస్తాలకు గోపీనాథపట్నానికి చెందిన కార్తీక్ ఫిషరీస్ యాజమాన్యం పది కొత్త ద్విచక్ర వాహనాలను ఉచితంగా అందించారు. ఇటీవల దెందులూరు వద్ద జరిగిన చేపల లారీ ప్రమాదం తర్వాత... జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపల లోడింగ్ జట్టు సభ్యులు, జట్టు కూలీలు, చేపల లోడింగ్ గుమస్తాలు చేపల లారీలపైన ప్రయాణం చేయడం నేరమని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత చేపల ప్యాకింగ్, లోడింగ్, ఐస్ పరిశ్రమ నిర్వాహకులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కార్తీక్ ఫిష్ ప్యాకింగ్ అధినేత చేకూరి నాగబాబు రాజు (నాగబాబు) తన సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది, జట్టు కూలీలకు రూ.11 లక్షలతో పది కొత్త మోటార్‌సైకిళ్ళు, ప్రతి ఒక్కరికి హెల్మెట్లు కొనుగోలు చేసి శనివారం రాత్రి అందించారు. నిత్యం సుదూర ప్రాంతాలకు లారీలపై ప్రయాణించే కూలీలకు ఎలాంటి ప్రమాదాలు లేకుండా సురక్షితంగా ఉండేందుకు సొంతంగా బైకులు అందించడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు సైతం నాగబాబును అభినందించారు.



జట్టు కూలీలకు మోటార్ సైకిళ్లు అందించిన నాగబాబు

శిరోమణి మృతికి మానవత సంతాపం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు కి చెందిన పాతూరి నాగ వెంకట శిరోమణి (68) (ఎన్‌ఆర్‌ఐ) అనారోగ్యంతో మరణించారు. ఉంగుటూరులో ఆమె తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె మృతికి మానవత రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం మానవత ఉంగుటూరు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మానవత రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, కొనే వీర వెంకట సత్యనారాయణ, మంద జయలక్ష్మి, సతీష్, తాతారావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు

ఆ కాలనీల్లో సదుపాయాల్లేవ్..!

ప్రజల అవస్థలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆ కాలనీల్లో వసతుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచేందుకు రోడ్డు కూడా లేని పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే డ్రెయినేజీలోని మురికి నీరు రోడ్డుపైకి వస్తున్న దుస్థితి. దీంతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితి బట్టువారిగూడెం ఎస్‌సి కాలనీ, దేవుడు మాన్యం కాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, బోయగూడెం కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఆ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గణేష్ కాలనీలోకి వెళ్లే రోడ్డు ఉన్నప్పటికీ డ్రెయినేజీ లేకపోవడంతో మురికి నీరు సిమెంట్ రోడ్డుపై నిలుస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. తాగునీరు పట్టుకోవాలన్నా ఆ మురికి నీటిలో నిలబడి పంపులు వచ్చినప్పుడు నీరు పట్టుకోవాల్సి వస్తుంది. వీధిలైట్లు పోయిన పట్టించుకునే వారే లేరని, నెలల తరబడి చీకట్లోనే ఉండాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. బోయగూడెం కాలనీ రోడ్డుపైన పక్కన ఉన్న చెరువు నీరు ప్రవహిస్తూ నడవడానికి అసలు వీలు లేకుండా ఉంది. ఈ కాలనీలో కరెంటు స్తంభాలు వేసినప్పటికీ లైనింగ్ ఇంకా లాగలేదు. లైట్లు కూడా లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్‌ఆర్ కాలనీ మరీ అధ్వానంగా ఉండడంతో అక్కడ తాగునీటి సమస్య కూడా ఉంది. రోడ్లు, డ్రెయినేజీలు లేనే లేవు. వర్షం వస్తే నడిచేందుకు చాలా కష్టంగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల విషసర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని, పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. కొన్ని కాలనీల్లో మున్సిపాలిటీ వారు చెత్త తీయటానికి కూడా రారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోవాలని అధికారులను కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

వర్షపు నీటిలో అవస్థలు

పాస్‌పోర్టు పోయినది

పాల చలపతిరావు, S/o.పాల బుల్లియ్య, డోర్‌నెం. 1-82/2 రామాలయం దగ్గర, రామ చంద్రాపురం పంచాయతి, కొండేపూడి గ్రామం, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా. అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పాస్‌పోర్టు నెం. H6438719 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు ది. 12-07-2025వ తేదీన నాస్వగ్రామం రామచంద్రాపురం నుండి వేంద్ర జిరాక్స్ సెంటర్‌కు పాస్‌పోర్టు జిరాక్స్ తీయించు నిమిత్తం నా యొక్క మోటారు సైకిల్‌పై వెళ్లుచుండగా దారిమధ్యలో నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఉన్న గల కవరు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పాల చలపతిరావు, S/o.బుల్లియ్య, డోర్‌నెం. 1-82/2, రామాలయం దగ్గర, రామచంద్రపురం, కొండేపూడి, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా. సెల్: 8985450030